సాక్షి కర్నూలు

గురువారం ı 6 ı మార్చి ı 2025



కుమారస్వామికి షష్ఠి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో షష్ఠిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మహమూద్ షా ఖాద్రీ ఉరుసు సందర్భంగా ఓర్వకల్లులో బుధవారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎన్ కొంతలపాడు జట్టు విజేతగా నిలిచింది.



భలే బాతులు

దొర్నిపాడు: చిత్తూరు జిల్లా నుంచి ప్రతి ఏటా ఆహారం కోసం బాతులను తీసుకొస్తున్నారు. చూటముచ్చటగా కనిపిస్తూ అవి పొలాల్లో, కాల్వల వెంట నీటిలో ఉన్న ఆహారాన్ని స్వీకరిస్తాయి.

న్యూస్‌రీల్

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.90.16లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం హుండీని బుధవారం స్థానిక కాలక్షేప మండపంలో లెక్కించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేశ్ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. 57రోజులకు సంబంధించి భక్తులు స్వామి వారికి నగదు రూపంలో రూ.90,16,666 సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వెండి 11కేజిల 20గ్రాములు, బంగారం 13 గ్రాములు వచ్చిందన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లోని కేసుల పరిష్కారానికి ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ పి.లీలా వెంకట శేషాద్రి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయ స్థానాల్లో పెండింగ్ ఉండి రాజీ పడేందుకు సిద్ధంగా ఉన్న సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవాలని బాధితులకు సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా ఉద్యోగులకు నేడు, రేపు ప్రత్యేక సెలవులు

కర్నూలు(అగ్రికల్చర్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగులకు ఈ నెల 6, 7 తేదీలను ప్రత్యేక సాధారణ సెలవులుగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా తేదీల్లో మహిళా ఉద్యోగులకు ఆటలు పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించే 8వ తేదీ రెండవ శనివారం కావడంతో సెలవు వస్తుంది. ఇటీవల ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు ఈనెల 6, 7 తేదీలను ప్రత్యేక సాధారణ సెలవులుగా ప్రకటించాలని కోరారు. ఆ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వెంగళ్‌రెడ్డితో పాటు అసోసియేషన్ కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, నగరశాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, ఉమన్ వింగ్ నేత చందన తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.


దూదేకొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్

కర్నూలు(అగ్రికల్చర్): పత్తికొండ మండలం దూదేకొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2.50 ఎకరాల్లో యూనిట్ ఏర్పాటుకు బుధవారం జీఓ విడుదల చేసింది. ఇందుకు కేంద్రం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద రూ.8 కోట్లు, కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆపరేషన్ గ్రీన్ రూ.3 కోట్లు విడుదల చేయనుంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులు వినియోగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పత్తికొండ మండలం హోసూరు వద్ద టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయతలపెట్టింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. పనులు కూడా మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పనులు నిలిచిపోయాయి. తాజాగా దూదేకొండలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంది.

ఫేక్ కాల్స్ నమ్మొద్దు

కర్నూలు(అర్బన్): మూడు చక్రాల వాహనాలు (స్కూటీ), ల్యాప్‌టాప్, ఇతర సహాయ పరికరాలు మంజూరు అయ్యాయని 9642076467, 6364506562, 6300090356 నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహాయ పరికరాలు అందించాలంటే కొంత డబ్బు ఫోన్‌పే చేయాలని కొందరు దివ్యాంగులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి కాల్స్ వల్ల దివ్యాంగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సహాయ పరికరాల సమాచారం కోసం తమ కార్యాలయ ఫోన్ నంబర్‌ను 08518-277864ను సంప్రదించాలన్నారు.

రెగ్యులర్ సీఈగా కబీర్ బాషా



కర్నూలు (సిటీ): కర్నూలు ప్రాజెక్ట్స్ ఇన్‌చార్జ్ సీఈగా పనిచేస్తున్న షేక్ కబీర్ బాషాకు పదోన్నతి కల్పించి రెగ్యులర్ సీఈగా నియమించారు. ఈయన ఎస్‌ఆర్‌బీసీ సర్కిల్-1 పర్యవేక్షక ఇంజినీర్‌గా పనిచేస్తూనే 2022 జులై 4వ తేదీ నుంచి ఇన్‌చార్జ్ సీఈగా పనిచేస్తున్నా రు. హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం పర్యవేక్షక ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎంఎల్‌వీ వరప్రసాద్‌ను తెలుగుగంగ తిరుపతి చీఫ్ ఇంజినీర్‌గా నియమించారు.

సచివాలయాలకు సర్దు‘పోటు’

- సమీప సచివాలయాల గ్రూపింగ్‌కు రంగం సిద్ధం
- రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు
- ఉద్యోగులను రెండు కేటగిరీలుగా విభజన
- మొదటి దశలో టెక్నికల్ ఫంక్షనీర్స్‌పై దృష్టి
- అనంతరం మల్టీపర్పస్ ఫంక్షనీర్స్‌కు కదలిక
- ప్రభుత్వ చర్యతో తిరిగి ప్రారంభం కానున్న రాజకీయ ఒత్తిళ్లు

సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందజేయాల్సిన గ్రామ, వార్డు సచివాలయాలను బలహీన పరిచేందుకు ‘కూటమి’ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సమీపంలో ఉన్న రెండు, మూడు సచివాలయాలను ఒకే క్లస్టర్ కిందకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. గ్రూపింగ్ పేరుతో ఈ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. అలాగే ఆయా గ్రామ/ వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులను సర్దుబాటు చేయనున్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన ‘సచివాలయ’ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి.



కోడుమూరు మండలం పులకుర్తి గ్రామ సచివాలయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో జీరో వేకెన్సీకి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు. ఆయా శాఖల్లో ఖాళీ అయిన ఉద్యోగాల భర్తీకి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. గ్రామ/ వార్డు సచివాలయాల్లో

1,969 పోస్టులకు మంగళం

ఖాళీగా ఉన్న 1,969 పోస్టుల భర్తీకి మూడో విడత నోటిఫికేషన్ జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియకు అప్పట్లో బ్రేకులు పడ్డాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న హేతుబద్ధీకరణ పూర్తయితే కొత్త పోస్టుల భర్తీ లేనట్టే అని స్పష్టమవుతోంది.

కర్నూలు(అర్బన్): ఎవరి సిఫార్సులు లేకుండా, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. అప్పట్లో ఈ వ్యవస్థను పరిశీలించి వివిధ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు మెచ్చుకున్నారు. అయితే రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆదర్శ వ్యవస్థను ప్రజలకు దూరం చేసే కుట్ర చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. అందులో భాగంగానే సచివాలయాల గ్రూపింగ్ పేరుతో సమీపంలో ఉన్న రెండు, మూడు సచివాలయాలను ఒకే క్లస్టర్ కిందకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులను సర్దుబాటు చేసేందుకు అనుగుణంగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోనే గ్రామ/వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను టెక్నికల్ ఫంక్షనీర్స్, మల్టీపర్పస్ ఫంక్షనీర్స్‌గా రెండు విభాగాలుగా విభజించారు. ప్రస్తుతం ప్రతి సచివాలయంలో అన్ని విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన క్లస్టర్ ప్రక్రియ పూర్తి అయితే ముందుగా టెక్నికల్ ఫంక్షనీర్స్‌గా గుర్తించిన ఉద్యోగులు ఒక్కొక్కరు రెండు లేక మూడు సచివాలయాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆయా కేటగిరిలకు చెందిన మిగిలిన ఉద్యోగులను ఖాళీగా ఉన్న ప్రాంతాలకు లేదా ఇతర శాఖలకు బదలాయించే అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. టెక్నికల్ ఫంక్షనీర్స్ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం ఆయా సచివాలయాల పరిధిలోని జనాభాను అనుసరించి మల్టీపర్పస్ ఫంక్షనీర్స్‌పై దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి.

సచివాలయ ఉద్యోగుల వివరాలు

జిల్లా	సచివాలయాలు	మంజూరైన పోస్టులు	విధులు నిర్వహిస్తున్న వారు	ఖాళీలు
కర్నూలు	672	5,738	4,256	1,482
నంద్యాల	516	4,297	3,810	487
మొత్తం:	1,188	10,035	8,066	1,969

ఫంక్షనీర్స్ ఎవరంటే..

- వీఆర్‌ఓ, సర్వే అసిస్టెంట్, ఏఎన్‌ఎం, అగ్రికల్చర్/ హార్టికల్చర్ అసిస్టెంట్, పశుసంవర్ధశాఖ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్‌లను ప్రభుత్వం టెక్నికల్ ఫంక్షనీర్స్‌గా గుర్తించింది.
- మల్టీ పర్పస్ ఫంక్షనీర్స్‌గా పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌ను గుర్తించారు.

మొదటి దశలో టెక్నికల్ ఫంక్షనీర్స్‌పై దృష్టి

సచివాలయాల గ్రూపింగ్ పూర్తి అయిన వెంటనే టెక్నికల్ ఫంక్షనీర్స్‌ను కదలించే చర్యలు ప్రారంభం కానున్నాయి. ఒక సచివాలయంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇక నుంచి సమీపంలోని రెండు, మూడు సచివాలయాల్లో కూడా సేవలు అందించాల్సి ఉంటుంది. క్లస్టర్ పరిధిలోకి వచ్చిన రెండు, మూడు సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను జిల్లాలో ఎక్కడైనా ఆ పోస్టులు ఖాళీగా ఉంటే అక్కడికి బదిలీ చేయవచ్చు. ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగాల్లోనైనా వీరి సేవలను ఉపయోగించుకునే అవకాశాలు ఉన్నాయి. టెక్నికల్ ఫంక్షనీర్స్ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం ఇదే విధానాన్ని మల్టీపర్పస్ ఫంక్షనీర్స్‌గా గుర్తించి ఉద్యోగులకు కూడా వర్తింప చేయనున్నారు.

రాజకీయ ఒత్తిళ్లు ప్రారంభం

ప్రభుత్వం తీసుకున్న సచివాలయాల గ్రూపింగ్ విధానంలో రాజకీయ ఒత్తిళ్లు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. తమకు ఇష్టం లేని వారిని సుదూర ప్రాంతాలకు, ఇతర ఇంజినీరింగ్ విభాగాలకు పంపించాలని టీడీపీ నేతలు.. సంబంధిత అధికారులపై ఒత్తిడి చేసే ప్రమాదం ఉంటుంది. ఉద్యోగుల బదిలీల్లో భాగంగా గత నాలుగు నెలల క్రితం ఇతర ప్రభుత్వ శాఖల్లో నిర్వహించిన విధంగానే సచివాలయ ఉద్యోగులను బదిలీ చేశారు. తిరిగి ఇప్పుడు సచివాలయాల గ్రూపింగ్ పేరుతో ఉద్యోగులను ఇబ్బంది పెడితే రాజకీయ నాయకులకు మరోసారి అవకాశం కల్పించినట్టవుతుందనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

మళ్లీ అవే కష్టాలు

గ్రామ/ వార్డు వ్యవస్థ ఆవిర్భావానికి ముందు మూడు, నాలుగు గ్రామాలకు ఒక్క పంచాయతీ కార్యదర్శి మాత్రమే ఉండేవారు. వ్యవసాయ అసిస్టెంట్లు ఎక్కడో ఉండేవారో తెలియని పరిస్థితి. అవసరాలకు అనుగుణంగా సర్వేయర్లు లేకపోవడంతో కూడా పలు మండలాల్లో ఇన్‌చార్జ్ సర్వేయర్లతో ప్రజలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న సచివాలయాల క్లస్టర్ల విధానంతో పాత రోజులు పునరావృతం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గ్రూపింగ్‌లో భాగంగా తీసుకోబోయే నిర్ణయాలతో ఆయా సచివాలయాల్లోని కీలకమైన ఉద్యోగులు రెండు, మూడు గ్రామాలకు ఒకరు ప్రకారం పనిచేయాల్సిన పరిస్థితులు మళ్లీ రానున్నాయి. గ్రామాల్లో సర్వేయర్ల సమస్య తీవ్రంగా వేధించే అవకాశం కూడా లేకపోలేదు.

రెండు రోజుల్లో గ్రూపింగ్ పూర్తి చేయాలని ఆదేశాలు



ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి గ్రామ/వార్డు సచివాలయాల గ్రూపింగ్‌ను రెండు రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ద్వారా జిల్లాలోని అందరు ఎంపీడీఓలకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. ఎలా గ్రూపింగ్ చేయాలి, వాటి మార్గదర్శకాలకు సంబంధించిన సూచనలను ఎంపీడీఓలకు తెలియజేశాం. గ్రూపింగ్ పూర్తి అయితే సచివాలయాలు అక్కడే ఉంటాయి, కాకపోతే ఉద్యోగులకు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. సమీపంలోని రెండు లేదా మూడు సచివాలయాలను ఒక క్లస్టర్ కిందకు తీసుకువస్తాం.

– జీ నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ అధికారి

ఆతిథ్య సేవలకు రేటింగ్



హాజరైన అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ నిబంధనల మేరకు పర్యాటక ఆతిథ్యాలకు స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ (ఎస్‌జీఎల్‌ఆర్) ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా ఎస్‌జీఎల్‌ఆర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, హోమ్‌స్టేలు, ధర్మశాలలు, లాడ్జీలకు రేటింగ్‌ను ప్రకటించాలన్నారు. టాయిలెట్ సదుపాయాలు, తడి, పొడిచెత్తను వేరుచేసే విధానాలను పరిశీలించి రేటింగ్ ఇవ్వాలన్నారు. మునిసిపల్ కమిషనర్లు, డీపీఓలు ఈ అంశంపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఆతిథ్య సంస్థలకు జిల్లా, డివిజనల్ స్థాయిల్లో వర్కుషాపులు నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్, టూరిజం, పంచాయతీ, అధికారులను ఆదేశించారు. దీనిపై మార్చి 31లోపు నివేదిక సమర్పించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలను ఆదేశించారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ, డీపీఓ భాస్కర్, ఏపీ టూరిజం కార్పొరేషన్ డిప్యూటీ మేనేజర్ సువర్ణ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మహిళా ఉద్యోగులు, మహిళా ఖాతాదారులు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) రీజినల్ ఆఫీసు హెడ్ పి.నరసింహరావు తెలిపారు. సాధారణ ఆరోగ్య సమస్యలకు ఓమిని హాస్పిటల్ వైద్యులు, దంత సమస్యలపై స్మైల్ డెంటల్ కేర్ డాక్టర్లు, కంటి సమస్యలకు సుశీల నేత్రాలయ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంలో అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్స్ సురేంద్రగౌడు, ఎస్‌వీ అనంతకుమర్ పాల్గొన్నారు.

సారా తయారీ మానుకుంటే ‘నవోదయం’



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

వెల్దుర్తి: బతుకుదెరువు కోసమని సారా తయారు చేస్తూ చివరకు పోలీసు స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగడంతోనే బతుకులను నాశనం చేసుకుంటున్నారని, తయారీ మానుకుంటేనే జీవితాల్లో నవోదయం వస్తుందని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి అన్నారు. బుధవారం ఆమె మండలంలోని ఎల్.నగరం తండాలో అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్ బాబుతో కలిసి నవోదయం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు గ్రామస్తులతో మమేకమై, వారి కుటుంబాలతో కలిసి మాట్లాడుతూ సారా తయారీ మానుకునే వారికి జీవనాధారం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మానుకోకపోతే పీడీ యాక్టు నమోదుకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. నాటు సారా తయారీ, అమ్మకం, తాగడం ద్వారా జరిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, ఏఈఎస్ రాజశేఖర్ గౌడ్, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల, ఎస్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

క్యాన్సర్ చికిత్సకు లీనాక్ మిషన్ ప్రారంభం



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో క్యాన్సర్ చికిత్సలో భాగమైన లీనాక్ మిషన్‌ను బుధవారం మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో 80 శాతం వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇప్పటికే ఓపీ సేవలు, ఇన్‌పేషెంట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, మరికొన్ని ఆపరేషన్ థియేటర్ పరికరాలు రావాల్సి ఉందన్నారు. అవి వచ్చిన వెంటనే త్వరలో ఆపరేషన్ థియేటర్ సేవలు కూడా ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమ నళిని పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:31	ఉ॥ 5:10
ఆదోని	సా॥ 6:30	ఉ॥ 5:12
నంద్యాల	సా॥ 6:28	ఉ॥ 5:10
ఆత్మకూరు	సా॥ 6:27	ఉ॥ 5:05
బనగానపల్లె	సా॥ 6:30	ఉ॥ 5:07

హదీస్ వెలుగు :

‘రంజాన్ ఉపావాస దీక్ష మనిషిలోని అహాన్ని తొలగించి.. ఆధ్యాత్మికత, మంచి నడవడికను నేర్పుతుంది. వీటిని తప్పనిసరిగా పాటించి అల్లాహ్ అనుగ్రహం పొందండి.’

– పవిత్ర ఖురాన్

ఉష్ణోగ్రతలు

కనిష్టం	24.0
గరిష్టం	38.9

‘కూటమి’ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత



మాట్లాడుతున్న శశికళ

ఆదోని టౌన్: రాష్ట్రంలోని ‘కూటమి’ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శశికళ కృష్ణమోహన్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆదోని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లో ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కడమే లక్ష్యంగా పెట్టుకోవడం దారుణమన్నారు. ఆదోని పట్టణంలోని భీరప్పస్వామి దేవాలయ ఆవరణలో ఈనెల 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు ఆమె తెలిపారు. అందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. దళిత మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, మహిళా నాయకురాళ్లు శ్రీదేవి, సుగుణ, సుభాషిణి పాల్గొన్నారు.

అప్పు కట్టలేదని రైతు బైకు స్వాధీనం



చిప్పగిరి మండలంలో రైతు బైక్‌ను స్వాధీనం చేసుకున్న డీసీసీబీ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్)/చిప్పగిరి: పంటలు పండక, ప్రకృతి సహకరించక.. సరైన గిట్టుబాటు ధర లభించక రైతుల జీవనం దినదిన గండంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం రైతులను ఏమాత్రం ఆదుకోకపోగా, వ్యవసాయాన్ని కష్టతరం చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకులు సైతం రుణాల రికవరీ పేరిట ఆస్తులను జప్తు చేసేందుకు సిద్ధపడటం విమర్శలకు తావిస్తోంది. జిల్లా సహకార కేంద్రబ్యాంకు రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించింది. బుధవారం ఐదు ప్రత్యేక బృందాలు ఆలూరు, పత్తికొండ, డోన్ ప్రాంతాల్లో రుణాలు రికవరీకి రైతుల ఇళ్లకు వెళ్లారు. ఆరేడేళ్ల క్రితం డీసీసీబీ నుంచి రుణాలు తీసుకొని ఇంతవరకు ఒక్క కంతు కూడా చెల్లించకపోవడంతో వడ్డీ, అపరాధవడ్డీలతో అప్పు పేరుకుపోయిందని, వెంటనే చెల్లించాలని కోరారు. ఆలూరు బ్రాంచ్ పరిధిలోని చిప్పగిరి మండలం కుందనగుర్తి గ్రామానికి చెందిన ఓ రైతు 2016లో రూ.1.08 లక్షల అప్పు తీసుకోగా ఇప్పుడు వడ్డీతో కలిసి రూ.3 లక్షలు దాటింది. డీసీసీబీ జనరల్ మేనేజర్ పి.రామాంజనేయులు ఆధ్వర్యంలో టీమ్ రికవరీకి వెళ్లగా రైతు తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని వాపోయాడు. దీంతో అధికారులు రైతుకు చెందిన బైక్‌ను స్వాధీనం చేసుకుని సంబంధిత సొసైటీకి అప్పగించారు. కూటమి ప్రభుత్వంలో రైతుల దయనీయ స్థితికి ఆ ఘటన అద్దం పడుతోంది.


లింగ సమానత్వంపై చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కర్నూలు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు లింగ సమానత్వంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మహిళా చట్టాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై 5 రోజులుగా మహిళలు, విద్యార్థి నులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అత్యవసర సేవల కోసం పోలీస్ హెల్ప్‌లైన్ 100/112, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ లైన్ నెంబర్ 1098ను సంప్రదించాలని అవగాహన సదస్సుల్లో సూచిస్తున్నారు.

అహోబిలం.. బ్రహ్మోత్సవ వైభవం



సింహవాహనంపై జ్వాలా నరసింహ స్వామి

ఆళ్లగడ్డ: శ్రీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు నాంది పులుకుతూ దిగువ అహోబిలంలో అంకురార్పణ కార్యక్రమాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పది రోజుల పాటు ఎటువంటి ఆటంకాలు లేకుండా క్రతువులు జరగాలని శాస్త్రోక్తంగా విశ్వక్సేనుడికి అహోబిల మఠం పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్, వేదపండితులు, అర్చకులు ఆరాధన చేశారు. అనంతరం తిరుమంజనం, స్వస్తివచనంతో పాటు ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలకు సిద్ధం చేశారు. వైష్ణవ ఆచారం ప్రకారం రాత్రివేళ వేదమంత్ర పఠనాలతో మృత్యుంగ్రహణం పర్వాన్ని చేపట్టారు. అనంతరం ఈశాన్యంలోని పుట్టమన్ను తెచ్చి నవధాన్యాలను నాటి బ్రహ్మోత్సవాలకు నాంది పలికారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున దిగువ అహోబిలంలో ధ్వజారోహణ కార్యక్రమం జరగనుంది. అనంతరం భేరీ పూజ, రాత్రి సింహ వాహన సేవలు కొనసాగుతాయి.

ఎగువ అహోబిలంలో..

బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గరుత్మంతుని చిత్రపటావిష్కరణ చేశారు. బుధవారం రాత్రి జ్వాలా నరసింహస్వామి సింహవాహనంపై అధిష్ఠించి భక్తులకు దర్శనమిచ్చారు. సింహహనంపై కొలువైన స్వామికి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.